శనివారం 05-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 476 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## తూటాలతో దద్దరిల్లిన ఛత్తీస్‌గఢ్

- భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు
- ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతి
- పోలీసు ఉన్నతాధికారులు ఒక ప్రకటన



**ముందడుగు ఛత్తీస్‌గఢ్:**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ- నారాయణ్‌పుర్ సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో పలు ఆయుధాలతోపాటు భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్లలో ఇదొకటి కావడం గమనార్హం.

మిగతా 2లో

# రైల్వేలను ప్రైవేటీకరించే ప్రశ్నేలేదు

### తమ దృష్టంతా నాణ్యమైన సేవలపైనే
### రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

**ముందడుగు జాతీయం:**



దేశంలో రైల్వేశాఖను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. తమ దృష్టంతా తక్కువ ధరకు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపైనే ఉందన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రూ.400 కన్నా తక్కువ ఖర్చుతోనే ప్రజలు వెయ్యి కి.మీల వరకు సౌకర్యవంతంగా ప్రయాణించేలా చూడటమే తమ లక్ష్యమని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రైల్వేలో పూర్తిస్థాయిలో మార్పులు వస్తాయన్నారు. వందే భారత్, నమో భారత్ వంటి రైళ్లతో పాటు రైల్వే రక్షణ యంత్రాంగం కవచ్ ఏర్పాటు ద్వారా ఈ మార్పులు తీసుకోస్తామని చెప్పారు. ఇది రైల్వేల పరివర్తన యుగంగా అభివర్ణించారు.

రైల్వేలను ప్రైవేటీకరించే ప్రశ్నే లేదని, రైల్వేలు, రక్షణ వ్యవస్థ భారత దేశానికి వెన్నెముక లాంటివన్నారు. ఈ విషయాన్ని అసత్యాలు ప్రచారం చేస్తున్నవారు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రైల్వేల రాజకీయీకరణకు ప్రధాని నరేంద్ర మోదీ చెక్ పెట్టారని, ప్రస్తుతం పనితీరు, భద్రత, సాంకేతికత, అందరికీ తక్కువ ధరలకే సేవలందించడంపైనే దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆర్‌పీఎఫ్ జోనల్ సెంటర్ల అప్‌గ్రేడ్‌కు రూ.35కోట్లు కేటాయించామన్న మంత్రి వైష్ణవ్.. సర్వీస్ నిబంధనలు, ప్రమోషన్లు వంటి డిమాండ్లను పరిశీలిస్తున్నామన్నారు. గత పదేళ్లలో 31 వేల కి.మీల మేర కొత్త ట్రాక్‌లు నిర్మించినట్లు వెల్లడించారు.




సచివాలయం మూడో అంతస్తు నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్

మిగతా 2లో




శత్రువుల ప్రణాళికలను భగ్నం చేస్తాం

మిగతా 2లో




షార్ట్స్ వీడియోల నిడివి పెంచిన యూట్యూబ్

మిగతా 3లో



తండ్రిని చంపిన వ్యక్తిపై ప్రతీకారం..

మిగతా 4లో

# తనకు ఎలాంటి మినహాయింపులు వద్దు

### రేవంత్ రెడ్డికి కేవీపీ రామచంద్రరావు లేఖ

**ముందడుగు జాతీయం:**



కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతగా తనకు ఎలాంటి మినహాయింపులు వద్దని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఎలా ఉంటుందో అలాగే వ్యవహరిస్తే చాలన్నారు.

మిగతా 2లో




# గ్రూప్-1 నోటిఫికేషన్‌పై తీర్పు రిజర్వ్

### వాదనలు వినిపించిన టీజీపీఎస్సీ
### శుక్రవారానికి వాయిదా వేసిన హైకోర్టు

02

ముందడుగు
శనివారం, 05-10-2024, హైదరాబాద్

# తూటాలతో దద్దరిల్లిన ఛత్తీస్‌గఢ్

(మొదటి పేజీ తరువాయి)

అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులకు పాల్పడగా.. భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో 30 మంది మూవోయిస్టులు మృతి చెందారు. సుమారు గంటపాటు ఎదురుకాల్పుల తర్వాత, ఎన్‌కౌంటర్ స్థలం నుంచి 30 మంది మావోయిస్టుల మృతదేహాలు, AK-47 రైఫిల్, ఒక SLR (సెల్ఫ్-లోడింగ్ రైఫిల్) సహా పలు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. మరోవైపు, ఆ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. తాజా ఎదురుకాల్పుల ఘటనతో 2024లో బస్తర్ ప్రాంతంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 187 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

# సచివాలయం మూడో అంతస్తు నుంచి దూకిన డిప్యూటీ స్పీకర్

## మహారాష్ట్రలో ఉద్రిక్తత ఘటన

ముందడుగు మహారాష్ట్ర:

మహారాష్ట్రలో ఆదివాసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సొంత వర్గం ఎమ్మెల్యేలే ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ సహా కొందరు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ సచివాలయం మూడో అంతస్తు నుంచి దూకారు. అక్కడ సేఫ్టీ నెట్ ఉండటంతో వీరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ పరిణామాలతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధన్‌గఢ్ కమ్యూనిటీని ఎస్టీ కేటగిరీలో చేర్చాలన్న డిమాండ్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ వర్గానికి చెందిన ఎన్సీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ నరహరి ఝిర్వాల్‌తో పాటు భాజపా ఎంపీ హేమంత్ సావ్రా, ఎమ్మెల్యేలు కిరణ్ లహమాటే, హిరామన్ ఖోస్కర్, రాజేష్ పాటిల్ నిరసన చేపట్టారు. సచివాలయంలోని మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. మొదటి అంతస్తు వద్ద ఏర్పాటు చేసిన సేఫ్టీ నెట్‌లో పడ్డారు. పోలీసులు వెంటనే వారిని రక్షించారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. అనంతరం వారంతా సచివాలయం ముందు బైఠాయించి ఆందోళన కొనసాగించారు.



# గ్రూప్-1 నోటిఫికేషన్‌పై తీర్పు రిజర్వ్




ముందడుగు తెలంగాణ:

తెలంగాణ హైకోర్టులో గ్రూప్1 నోటిఫికేషన్‌పై విచారణ ముగిసింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. గ్రూప్1 పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణుల కమిటీకి పంపి.. వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు గురువారం నివేదించింది. త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని, ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొంది. గ్రూప్1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరపున ఎం.రాంగోపాల్‌రావులు వాదనలు వినిపిస్తూ పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు.

వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను న్యాయమూర్తి శుక్రవారానికి వాయిదా వేశారు. వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

# శత్రువుల ప్రణాళికలను భగ్నం చేస్తాం

## ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ

ముందడుగు జాతీయం:

తమ శత్రువుల ప్రణాళికలను భగ్నం చేస్తామని, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా లెబనాన్, పాలస్తీనాలలో జరుగుతోన్న పోరాటాలకు మద్దతు ఇస్తున్నామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఐదేళ్లలో తొలి సారిగా శుక్రవారం ఉపన్యాసంలో ప్రసంగించిన ఆయన.. ఇజ్రాయెల్‌పై ఇటీవల చేసిన క్షిపణి దాడులను సమర్థించుకున్నారు. ఈ సందర్భంగా హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణం తమనెంతో బాధించిందన్నారు. "హమాస్, హెజ్‌బొల్లాలపై ఇజ్రాయెల్ ఏ విధంగానూ విజయం సాధించదు. సయ్యద్ హసన్ నస్రల్లా మనమధ్య లేనప్పటికీ ఆయన సూచించిన మార్గం ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆయన బలిదానం వృథా కాదు. శత్రువు ప్రణాళికలను భగ్నం చేస్తాం.



వారికి వ్యతిరేకంగా మనమందరం ఏకం కావాలి" అని సుప్రీం లీడర్ ఖమేనీ పిలుపునిచ్చారు.

# తనకు ఎలాంటి మినహాయింపులు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

"మీరు, నేను కలుగజేసుకోకుండా చట్టాన్ని తన పని తాను చేసుకుని పోనిద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన, సుందరీకరణను స్వాగతిస్తున్నా. పార్టీ శ్రేయోభిలాషులు కొందరు మొదటి దశలో మూసీ ప్రక్షాళన చేయాలన్నారు. రెండో దశలో సుందరీకరణ చేపడితే బాగుంటుందని మీకు సూచించాలని కోరారు. మూసీ సుందరీకరణపై మీ ఆసక్తి, సమర్థతను గమనించే.. ఇవి మీ దృష్టికి తీసుకురాలేదు. పేదలకు నష్టం లేకుండా మన ప్రభుత్వం చేపట్టే అన్ని పనులు స్వాగతిస్తున్నా.
కొంత మంది నేతలు వారి స్వప్రయోజనాల కోసమే విమర్శలు చేస్తున్నారు. మూసీ విషయంలో ప్రతిపక్షాలది మొసలి కన్నీరేనని ప్రజలందరికీ తెలుసు. మీ ఆశయాలను దెబ్బతీసే కొంతమంది ప్రయత్నాలను నేను ఖండిస్తున్నా" అని కేవీపీ రామచంద్రరావు లేఖలో పేర్కొన్నారు.



ముందడుగు
శనివారం,
05-10-2024,
హైదరాబాద్

# చిన్నారుల వేధింపుల నిరోధానికి సహకరించని ఎక్స్

## జరిమానా విధించిన ఆస్ట్రేలియా న్యాయస్థానం



ముందడుగు జాతీయం:

సామాజిక మాధ్యమం ఎక్స్ చిన్నారులపై వేధింపుల నిరోధానికి సహకరించడంలేదని ఆస్ట్రేలియా న్యాయస్థానం చర్యలు తీసుకొంది. ఆ సంస్థకు విధించిన జరిమానాను సమర్థించింది. చిన్నారులపై వేధింపుల నిరోధానికి ఎక్స్ ఏం చర్యలు తీసుకుంటుందో వెల్లడించాలని ఆస్ట్రేలియాలోని ఇసేఫ్టీ కమిషనర్ కోరారు.

కానీ, వాటిని అందించడంలో ఆ సంస్థ విఫలమైంది. దీనిపై దిగువ న్యాయస్థానం సదరు సామాజిక మాధ్యమానికి 6,10,500 ఆస్ట్రేలియా డాలర్ల జరిమానా విధించింది. దీనిపై ఫెడరల్ కోర్ట్ ఆఫ్ ఆస్ట్రేలియాలో ఎక్స్ దరఖాస్తు చేసుకొంది. ఈ అంశంపై కోర్టు న్యాయమూర్తి స్పందిస్తూ.. నియంత్రణ సంస్థలు కోరిన సమాచారం ఇచ్చి తీరాలన్నారు. 2023 మొదట్లో తమ సంస్థ మస్క్ ఆధీనంలోకి వెళ్లిపోయిందని.. అందుకే తమకు పాత అంశాలపై బాధ్యతలుండవని ఎక్స్ వాదించింది.

విదేశీ కంపెనీలు విలీనాల తర్వాత ఆస్ట్రేలియా పరిధిలోని బాధ్యతలను తప్పించుకునేలా ఈవాదన ఉన్నట్లు ఇ సేఫ్టీ కమిషనర్ న్యాయస్థానం తీర్పు తర్వాత పేర్కొన్నారు. తాము ఆ సంస్థపై సివిల్ ప్రొసీడింగ్స్ కూడా చేపడతామని వెల్లడించారు. దీనిపై ఎక్స్ వెంటనే స్పందించలేదు.

# ఉగ్ర జాబితా నుంచి తాలిబన్లకు ఊరట

## రష్యా విదేశాంగ శాఖ నిర్ణయం

ముందడుగు జాతీయం:



తాలిబన్లు అఫ్గానిస్థాన్‌లో పరిపాలన కొనసాగిస్తున్న ఇప్పటికి ఇంకా ప్రపంచ దేశాలు అధికారికంగా గుర్తించడం లేదు. ఈ క్రమంలో వారికి ఊరట కలిగించే నిర్ణయం వెలువడింది. ఉగ్రవాద సంస్థల జాబితా నుంచి తాలిబన్‌ను తొలగించాలని రష్యా నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అత్యున్నత స్థాయిలో ఓ నిర్ణయం తీసుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ ప్రకటించింది.


అఫ్గానిస్థాన్ నుంచి ఆగస్టు 2021లో అమెరికా బలగాల ఉపసంహరణ తర్వాత.. అక్కడి పాలన తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ ప్రపంచంలో ఏ దేశం కూడా వారి పాలనను అధికారికంగా గుర్తించలేదు. కేవలం చైనా, యూఏఈలు మాత్రమే తాలిబన్‌ల రాయబారులను అంగీకరించాయి. అయితే, 2003లో 'తాలిబన్'ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చిన రష్యా.. వారితో సత్సంబంధాలు కొనసాగించేందుకు ఇటీవల ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇదే అంశంపై ఈ ఏడాది జులైలో మాట్లాడిన పుతిన్.. తాలిబన్ ఉద్యమాన్ని ఉగ్రవాదంపై పోరులో భాగంగానే చూస్తామని చెప్పారు. తాజా పరిణామాలపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ.. అఫ్గాన్ ప్రభుత్వంతో తాము ఆచరణాత్మక సంప్రదింపులు జరిపే అవసరముందన్నారు. ఆ దేశంతో రాజకీయ, వాణిజ్య, ఆర్థిక సంబంధాలను కొనసాగించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. తాజా నిర్ణయం వాస్తవరూపం దాల్చడానికి చట్టపరమైన పలు నిబంధనలు పాటించాల్సి ఉందని అఫ్గాన్ వ్యవహారాలు చూసే రష్యా ప్రతినిధి పేర్కొన్నారు.

# షార్ట్స్ వీడియోల నిడివి పెంచిన యూట్యూబ్

## 3 నిమిషాల వరకు పెంచుతూ నిర్ణయం

ముందడుగు జాతీయం:

ప్రస్తుత సోషల్ మీడియా సమాజంలో యూట్యూబ్‌కు ఉన్న ప్రత్యేకతనే వేరు. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ క్రేజ్ రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో చాలామంది యూట్యూబ్ వినియోగిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకూ ప్రతి ఒక్కరూ ఈ యూట్యూబ్‌లోని కంటెంట్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంటెంట్ సృష్టికర్తలు, వీక్షకుల కోసం యూట్యూబ్ ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తూనే ఉంటుంది. కొత్త కొత్త ఫీచర్లను అందుబాటులోకి తెస్తుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక ప్రకటన చేసింది.





కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ గుడ్ న్యూస్ చెప్పింది. షార్ట్స్ వీడియోల నిడివిని పెంచింది. యూట్యూబ్‌లో నెటిజన్లను ఎక్కువగా ఆకట్టుకునే ఫీచర్లలో షార్ట్స్ వీడియోలు ఒకటి. ఇప్పటి వరకూ 60 సెకెన్ల వరకూ ఉన్న షార్ట్స్ మాత్రమే అప్‌లోడ్ చేసుకునే వీలుండేది. అయితే, ఈ నిడివిని 3 నిమిషాల వరకూ పెంచుతూ యూట్యూబ్ నిర్ణయించింది. అక్టోబర్ 15 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది.

# హెజ్‌బొల్లా కోసం మరిన్ని సర్‌ప్రైజ్‌లు

## ఇజ్రాయెల్ రక్షణమంత్రి యోవ్ గాలంట్ వ్యాఖ్యలు

ముందడుగు జాతీయం:



హెజ్‌బొల్లా కోసం మరిన్ని సర్‌ప్రైజ్‌లు అట్టిపెట్టామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి యోవ్ గాలంట్ వ్యాఖ్యలు చేశారు. ఒకదాని తర్వాత ఒకటి హెజ్‌బొల్లాకు భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మేం నస్రల్లా (హెజ్‌బొల్లా చీఫ్)ను అంతంచేశాం. మరికొన్ని సర్‌ప్రైజ్‌లు అట్టిపెట్టాం. వాటిలో కొన్నింటిని పూర్తిచేశాం. మరికొన్ని పూర్తికానున్నాయి'' అని సైనికాధికారులతో మాట్లాడారు. ఇదిలా ఉంటే.. నస్రల్లా మరణం తర్వాత అతడి వారసుడిగా ప్రచారంలో ఉన్న హషీమ్ సఫీద్దీన్ లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేపట్టినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హషీమ్ ఓ అండర్‌గ్రౌండ్ బంకర్‌లో సీనియర్ హెజ్‌బొల్లా నేతలతో సమావేశంలో ఉండగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇజ్రాయెలీ అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ ఘటనలో హషీమ్ గాయపడ్డాడా? అతడి పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు.

ముందడుగు
శనివారం, 05-10-2024, హైదరాబాద్

# మ్యారిటల్ రేప్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

## భార్యకు ఇష్టం లేని శృంగారం నేరం కాదని వెల్లడి



**ముందడుగు జాతీయం:**

మ్యారిటల్ రేప్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యకు ఇష్టం లేని శృంగారాన్ని నేరంగా పరిగణించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి తగిన శిక్ష విధించేందుకు ఇతర చట్టాలు ఉన్నాయని చెప్పింది. మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించే అధికార పరిధి సుప్రీంకోర్టుకు లేదని స్పష్టం చేసింది. మ్యారిటల్ రేప్ అనేది చట్టపరమైన సమస్య కన్నా ఎక్కువగా సాంఘికపరమైనదని వివరించింది. దీని ప్రభావం నేరుగా సమాజంపై ఉంటుందని చెప్పింది. సంబంధితులందరితోనూ సంప్రదించకుండా కానీ, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కానీ మ్యారిటల్ రేప్‌పై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని తెలిపింది. వివాహం అనేది మహిళ ఇష్టానికి చెల్లుచీటీ రాయదనే విషయంతో కేంద్ర ప్రభుత్వం ఏకీభవించింది. మహిళ ఇష్టాన్ని పురుషుడు ఉల్లంఘించినట్లయితే, అందుకు దండన ఉండాలని తెలిపింది.

# తండ్రిని చంపిన వ్యక్తిపై ప్రతీకారం..

## తండ్రిని చంపిన తరహాలోనే హత్య చేసిన కొడుకు



**ముందడుగు గుజరాత్:**

తన తండ్రిని చంపిన వ్యక్తిపై కొడుకు అదే తరహాలో హత్య చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. తొలుత ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా పోలీసులు భావించారు. అయితే సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన తర్వాత అది హత్యగా నిర్ధారించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 1న అహ్మదాబాద్ పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడ్ని 50 ఏళ్ల నకత్ సింగ్ భాటీగా గుర్తించారు. సైకిల్‌పై వెళ్తున్న అతడ్ని ఒక వాహనం ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదంలో మరణించినట్లుగా పోలీసులు భావించారు.

ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. వాహనం నడిపిన ఒక వ్యక్తి ఉద్దేశపూర్వకంగా నకత్ సింగ్‌ను ఢీకొట్టి హత్య చేసినట్లు గ్రహించారు. నిందితుడ్ని గోపాల్ సింగ్ భాటీగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు 2002లో రాజస్థాన్‌లో గోపాల్ సింగ్ తండ్రిని నకత్ సింగ్ వాహరంతో ఢీకొట్టి చంపినట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీంతో 22 ఏళ్ల తర్వాత అతడు తన తండ్రి మరణానికి అదే తరహాలో ప్రతీకారం తీర్చుకున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# మెడికల్ బిల్లు ఎక్కువ వేశాడని డాక్టర్ హత్య

## ఢిల్లీలో ప్రాణాలు తీసిన ముగ్గురు మైనర్లు

**ముందడుగు ఢిల్లీ:**

ఓ డాక్టర్ మెడికల్ బిల్లు ఎక్కువ అడిగాడని ఏకంగా డాక్టర్ ప్రాణాలే తీసేశారు ముగ్గురు మైనర్లు. ఈ ఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. ఫరీదాబాద్‌లో ఒక బాలుడు ప్రమాదానికి గురయ్యాడు. సెప్టెంబర్ 2021 మధ్యరాత్రిలో ఢిల్లీలోని కాళింది కుంజ్ ప్రాంతంలోని నర్సింగ్ హోమ్ అయిన నిమా ఆస్పత్రికి వచ్చాడు. డాక్టర్ జావేద్ అక్తర్.. ట్రీట్‌మెంట్ చేసి రూ.1.200 బిల్లు ఇచ్చాడు. చిన్న దెబ్బకే ఇంత డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని వైద్యుడితో గొడవకు దిగాడు. ఇది తీవ్ర ఘర్షణకు దారి తీసింది. అనంతరం బాలుడు రూ.400 చెల్లించి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. 10 రోజుల తర్వాత కట్టు విప్పించుకునేందుకు తిరిగి తన అత్తతో కలిసి ఆస్పత్రికి వచ్చాడు. అయితే ఆస్పత్రి సిబ్బంది మాత్రం చికిత్స చేసేందుకు నిరాకరించారు. అంతేకాకుండా డాక్టర్ జావేద్ అక్తర్ మందలించాడు. దీంతో బాలుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అవమాన భారంగా భావించాడు. బాలుడు.. డాక్టర్ అక్తర్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు ఇద్దరు స్నేహితుల సహాయం కోరాడు. వారు అందుకు అంగీకరించారు. మొత్తానికి ఒక తుపాకీని సంపాదించుకుని ముగ్గురు ఆస్పత్రికి వచ్చారు. మరోసారి డ్రెస్సింగ్ చేయమని కోరితే.. డాక్టర్ నిరాకరించాడు. దీంతో వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులు జరపడంతో జావేద్ అక్తర్ ప్రాణాలు కోల్పోయాడు.




# కొన్ని కేక్‌లలో క్యాన్సర్ కారక పదార్థాలు

## కర్ణాటక ఆహార భద్రత విభాగం హెచ్చరిక

**ముందడుగు కర్ణాటక:**

చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఎంతో ఇష్టంగా తినే కొన్ని కేక్‌లలో "క్యాన్సర్" కారక పదార్థాలు ఉండే అవకాశం ఉందని కర్ణాటక ఆహార భద్రతనాణ్యత విభాగం హెచ్చరికలు జారీ చేసింది. రెండు నెలల క్రితం కబాబ్‌లు, మంచూరియన్, పానీ పూరీలతో సహా రాష్ట్రంలోని కొన్ని స్ట్రీట్ ఫుడ్ శాంపిల్స్‌లో కార్సినోజెన్స్ అని పిలువబడే క్యాన్సర్ కారక పదార్థాల ఉనికిపై ఆహార భద్రతా విభాగం ఇదే విధమైన ఆందోళనల్ని లేవనెత్తింది.



తాజాగా కేకుల్లో కూడా కార్సినోజెన్స్ ఉండే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చింది. ఆగస్టులో 235 కేక్ శాంపిళ్లను విశ్లేషించింది. ఇందులో 223 సురక్షితమే అని, అయితే 12 కేకుల్లో ఆర్టిఫిషియల్ కలర్స్ ప్రమాదకరమైన స్థాయిలో ఉన్నట్లు డిపార్ట్‌మెంట్ తెలిపింది. కేకుల్లో ఉపయోగించి కృత్రిమ రంగులైన అల్లూరా రెడ్, సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సిఎఫ్, పోన్సీయు 4ఆర్ (స్ట్రాబెర్రీ రెడ్), టార్ట్రాజైన్ (నిమ్మ పసుపు), కార్మోయిసిన్ (మెరూన్) వాటిని సురక్షితమైన స్థాయికి మించి ఉపయోగిస్తే క్యాన్సర్ ప్రమాదాలు పెరుగుతాయని హెచ్చరించింది. ఇది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేయొచ్చని తెలిపింది. ముఖ్యంగా "రెడ్ వెల్వెట్", "బ్లాక్ ఫారెస్ట్" వంటి ప్రసిద్ధమైన కేకులు తరుచుగా వైబ్రెంట్ కలర్స్‌తో తయారవుతాయి. ఇవి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరించారు.

ముందడుగు
శనివారం,
05-10-2024,
హైదరాబాద్

# ఉష్ణోగ్రత నియంత్రిత సౌకర్యాన్ని ప్రారంభించిన యూపీఎస్




ముందడుగు హైదరాబాద్:

భారతీయ ఫార్మా వినియోగదారులను, వారి అవసరాలను ప్రాధాన్యత ఇచ్చేందుకు రూపొందించిన ఈ ఫార్మాగ్రేడ్ సదుపాయం గ్లోబల్ ఫ్రైట్ ఫార్వార్డింగ్ సామర్థ్యాలతో అందుబాటులోకి వచ్చింది. ఇది అధునాతన ఉష్ణోగ్రత నియంత్రణ సామర్థ్యాలను కలిగి ఉంది. సున్నితమైన ఉత్పత్తులు ఎల్లప్పుడూ వాటి అవసరమైన ఉష్ణోగ్రత పరిధులలో నిల్వతో రవాణా చేస్తారని నిర్ధారిస్తుంది వాటి సామర్థ్యాన్ని మరియు భద్రతను సంరక్షిస్తుంది.

"ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో భారతదేశం ముందంజలో ఉన్నందున, మా వినియోగదారుల కోసం లాజిస్టిక్‌లను సరళీకృతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని యూపీఎస్ ఇండియా హెడ్, మువిన్ ఎక్స్‌ప్రెస్ డైరెక్టర్ గ్రెగోరీ గోబాబ్లే పేర్కొన్నారు. "ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు విషయానికి వస్తే, ఇది బయోలాజిక్స్, స్పెషాలిటీ ఫార్మాస్యూటికల్స్ మరియు వ్యక్తిగతీకరించిన వైద్యంలో ఆవిష్కరణల విషయంలో రక్షణ కవచంగా సరిపోయే కచ్చితమైన లాజిస్టిక్స్‌తో ఈ ఆవిష్కరణలను బ్యాకప్ చేయడానికి మేము ఇక్కడ ఉన్నాము" అని వివరించారు.

# ప్రశ్నిస్తే జర్నలిస్టులపై కేసులు పెడతారా

## భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే.. భారత సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ముందడుగు ఢిల్లీ:

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, విమర్శనాత్మక కథనాలు రాసినంత మాత్రన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని భారత సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అలా చేస్తే భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని స్పష్టం చేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఓ జర్నలిస్టు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించింది. ప్రభుత్వ పాలనా విభాగంలో కుల సమీకరణాలకు సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అభిషేక్ ఉపాధ్యాయ్ ఓ కథనం రాశారు. దీనిపై యూపీ పోలీసులతో పాటు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీనిని కొట్టివేయాలని కోరుతూ అభిషేక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంటుంది. కేవలం జర్నలిస్టులు రాసిన కథనాలను విమర్శలుగా భావించి, వారిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదు" అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. తదుపరి విచారణ నవంబర్ 5కు వాయిదా వేసింది.

# ముందడుగు సెల్ఫీ కాంటెస్ట్



## బతుకమ్మ చిత్రాలు

ముందడుగు తెలంగాణ:
ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను-నా బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన మహిళల బతుకమ్మ చిత్రాలు.. మీరు మీ బతుకమ్మతో సెల్ఫీ పంపాలనుకుంటే 9491114616 నంబర్ కు వాట్సప్ చేయగలరు. మీ ఫోటోను ముందడుగు పేపర్లో ప్రచురించడంతో పాటు ఎంపికైనా మొదటి ఐదుగురు విజేతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ చే బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.





